సమస్యల పరిష్కారానికి 'సాక్షి ఫోన్ ఇన్'

నేడు అల్వాల్ సర్కిల్ డీసీతో..

అల్వాల్: జీహెచ్‌ఎంసీ అల్వాల్ సర్కిల్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి 'సాక్షి' చొరవ తీసుకుంటుంది. దీనికోసం అల్వాల్ సర్కిల్ ఉపకమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో ఫోన్ ఇన్ కార్యక్రమం చేపడుతోంది. సర్కిల్ పరిధిలోని అల్వాల్, వెంకటాపురం, మచ్చబొల్లారం డివిజన్‌లలో సమస్యలను నేరుగా నేడు ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు ఫోన్‌చేసి తమ కాలనీలోని సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకురావచ్చు. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 8985409173, 9553955674

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం శిబిరంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జన్మదినం సందర్భంగా బుధవారం మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌండిన్య భవన్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రక్తదాతలకు హెల్మెట్లను అందజేశారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



పనులను ప్రారంభిస్తున్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. 26వ డివిజన్‌లో సీసీరోడ్డు పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దశలవారీగా ప్రధాన రహదారులను చేపడతామన్నారు. అత్యవసర పనులను ముందుగా చేపట్టి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా కాలనీవాసులకు మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం కలిసి కట్టుగా మొక్కలు నాటి సంరక్షిద్దామని పిలుపునిచ్చారు. కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతిగౌడ్, కార్పొరేటర్ శోభారాణి వెంకటేశ్ గుప్తా కాలనీవాసులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం ఉధృతం



అల్వాల్: అల్వాల్ సీపీఐ మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశం బుధవారం యాప్రాల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రజా పోరాటాలు ఉధృతం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయాలన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రొయ్యల కృష్ణమూర్తి, అల్వాల్ మండల కార్యదర్శి సహదేవ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మల నర్సింహులు, మండల కార్యదర్శులు చంద్రయ్య, సల్మాన్‌బేగ్, జంగయ్య, నరేంద్రచారి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



సైన్ బోర్డులను ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

అల్వాల్: ప్రమాదాల నివారణకు అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. బుధవారం అల్వాల్‌లోని ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా సైన్ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ.. రాంగ్‌రూట్, పార్కింగ్ లేని చోట వాహనాలు నిలపకూడదని, పలు సూచనలు చేశారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొత్త చట్టాల ప్రకారం జరిమానాలు, శిక్షలు ఉంటాయని వివరించారు.

మ్యాన్‌హోల్ సమస్యపై స్పందన



సాక్షి ఎఫెక్ట్..

బోడుప్పల్: ఈనెల 23న 'సాక్షి'లో 'మ్యాన్‌హోల్ సమస్యను పరిష్కరించండి' అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, కమిషనర్ రామలింగం ధ్వంసమైన మ్యాన్‌హోల్‌ను తొలగించి, దాని స్థానంలో కొత్త మ్యాన్‌హోల్‌ను ఏర్పాటు చేశారు.

తాగునీటి సమస్యలను పరిష్కరించాలి



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్

కాప్రా: గత నెలరోజులుగా కాప్రా డివిజన్ సాయిబాబానగర్ వాసులు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి రిజర్వాయర్ నుంచి అందించే కులాయి నీరు కూడా సరిగ్గా సరఫరా చేయడంలేదని స్థానికులు వాపోతున్నారు. పవర్‌బోర్ పనిచేయకపోవడంతో సమస్య మరింత తీవ్రంగా ఉందన్నారు. ఈ సమస్యను జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్‌శివమణి కాలనీలో పర్యటించి సమస్యపై ఆరా తీశారు. హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఏఈ రోహిత్‌ను పిలిపించి తక్షణమే నీటి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. పవర్‌బోర్‌కు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని సూచించారు.

కాలనీ సమస్యలపై..

సాయిబాబానగర్‌లో పర్యటించిన కార్పొరేటర్ స్వర్ణరాజ్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను ప్రజలు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కాలనీ పార్క్ నిర్వహణ, చెత్తా,చెదారంతో నిండిపోయిందని పేర్కొన్నారు. పార్క్‌లో ఉన్న వాలీబాల్ కోర్టుకు చుట్టూ నెట్ ఏర్పాటు చేయాలని, కాలనీలో వీధి దీపాల సమస్య అధికంగా ఉందన్నారు. సంబంధిత అధికారులకు ఫోన్‌చేసి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. సకాలంలో స్పందించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

అల్వాల్: అల్వాల్ మంగాపురం కాలనీ ఫేస్-2 వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అల్వాల్ చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చికెన్ షాప్ యజమానులు ఐక్యతతో ఉండి వినియోగదారులకు పేపర్ రేట్‌కు చికెన్‌ను అందించాలని సూచించారు. పరిశుభ్రత పాటిస్తూ.. నాణ్యతవైన ఆహారాన్ని అందించాలన్నారు. కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్, అల్వాల్ సీఐ రాహుల్‌దేవ్, చికెన్‌షాప్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు చెరకు యాదవరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సిరాజుద్దీన్, సుమన్‌నాయక్, కృష్ణారెడ్డి, స్థానిక నేతలు బొబ్బిలి సురేందర్‌రెడ్డి, బలవంత్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, కృష్ణగౌడ్, అశోక్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, చిట్టిబాబు, ఇసాక్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మేరు వసతి సత్రానికి విరాళం

మల్లాపూర్: యాద్రాదిలో నిర్మిస్తున్న మేరు వసతి సత్రానికి మల్లాపూర్‌కు చెందిన కర్నె సంధ్య, మల్లేష్ మేరు దంపతులు రూ.25,116 విరాళం అందజేశారు. కర్నె ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి మునిగాల సతీష్‌కుమార్ మేరు, తెలంగాణ మేరు జేఏసీ కన్వీనర్ విష్ణు, కోశాధికారి కరుణాకర్, సలహాదారులు రమేష్, కర్నె సోమేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



ఇంటింటికి మొక్కలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

బోడుప్పల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని 1వ డివిజన్ కార్పొరేటర్ బింగి జంగయ్యయాదవ్ అన్నారు. చెంగిచర్ల 1వ డివిజన్‌లో వనమహోత్సవంలో భాగంగా ఆయన కాలనీవాసులకు బుధవారం మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అందరం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



అల్వాల్: పేదింటి ఆడపిల్లలకు ఆర్థికసాయం చేయాలనే ఉద్దేశంతో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను గత ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. అల్వాల్‌కు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కల్యాణ లక్ష్మి పథకంలో అదనంగా ఒక తులం బంగారం ఇస్తామని చెప్పిందని, దానిని త్వరగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అల్వాల్ తహసీల్దార్ విజయకుమార్, కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్‌రెడ్డి, మీనాఉపేందర్‌రెడ్డి, నాయకులు అనిల్‌కిషోర్‌గౌడ్, రమేష్, ఉపేందర్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, యాదగిరిగౌడ్, పరమేష్, శరణగిరి, జావేద్, అఫ్జల్, సాజిద్, బషీర్, పవన్, రేవంత్, శోభన్, సరిత తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎండీఏ హామీలు అమలు చేయాలి

ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్



ఉప్పల్ డీసీకి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఉప్పల్: ఉప్పల్ భగాయత్ లేఅవుట్ అభివృద్ధికి సహకరించాలని ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ఉప్పల్ సర్కిల్ డీసీ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. లేఅవుట్‌లో హెచ్‌ఎండీఏ కేటాయించిన పార్కు, కమ్యూనిటీహాల్ స్థలాల్లో వాటిని నిర్మించాలన్నారు. రైతులు, రెసిడెన్సీ వాసులకు హెచ్‌ఎండీఏ ఇచ్చిన హామీలను వారు ఈ సందర్భంగా కమిషనర్‌కు గుర్తు చేశారు. 2500 గజాల స్థలంలో కమ్యూనిటీహాల్ నిర్మాణం చేపట్టాలని, ఐదెకరాల స్థలంలో శ్మశానవాటికను ఏర్పాటు చేయాలన్నారు. 8 ఎకరాలలో పార్కు, ఇండోర్ స్టేడియం నిర్మించాలని కోరారు. దీనిపై స్పందించిన డీసీ హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఆర్టీసీ డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

బోడుప్పల్: ఆర్టీసీ డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలు నివారించవచ్చని చెంగిచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ కవిత అన్నారు. చెంగిచర్ల ఆర్టీసీ డిపోలో బుధవారం నిర్వహించిన ప్రమాద రహిత వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాకాలంలో వేగ నియంత్రణ ముఖ్యమని, టర్నింగ్స్ వద్ద ఓవర్ టేకింగ్ చేయొద్దని సూచించారు. రోడ్డు భద్రత, నియమనిబంధనలను ఆర్టీసీ సిబ్బందికి ఆమె వివరించారు. ఘట్‌కేసర్ ఎస్సై నర్సింహ్మ, అసిస్టెంట్ మేనేజర్లు ఆనందరావు, సాయి సుబ్రమణ్యం, డిప్యూటీ సూపరిండెంటెంట్ సత్యన్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలి

మల్కాజిగిరి: ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దివ్యాంగులకు క్షమాపణలు చెప్పాలని, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు వినయ్ డిమాండ్ చేశారు. ఇటీవల ఎక్స్‌లో సివిల్స్‌లో దివ్యాంగుల రిజర్వేషన్లపై ఆమె చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ.. మల్కాజిగిరి చౌరస్తాలో ఆమె దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దివ్యాంగులు అంగవైకల్యం ఉండవచ్చునేమో.. మానసికంగా వారు ధృడంగా ఉంటారన్నారు. దేశంలో వివిధ పోస్టుల్లో దివ్యాంగులు పనిచేస్తున్నారనే విషయాన్ని ఆమె గుర్తుంచుకోవాలన్నారు. నాయకులు మంగమ్మ, కిరణ్, లక్ష్మి,షేక్ షబానా తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

మల్లాపూర్: మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా నాచారం తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నాచారం అంబేడ్కర్ విగ్రహం వద్ద 50 మందికి దుప్పట్లను పంపిణీ చేశారు. ఉద్యమకారులు పాగుల రమణారెడ్డి, నందికొండ శ్రీనివాస్‌రెడ్డి, మింద్రాల స్వామి, ఎర్రం శ్రీనివాస్‌రెడ్డి, ఏర్పుల నర్సింగ్‌రావు, లక్ష్మణ్, సుధాకర్, రాజు, భీమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



గౌతంనగర్: సంకటహర చతుర్థి సందర్భంగా బుధవారం గౌతంనగర్‌లోని శ్రీ విజయ వినాయక స్వామి ఆలయంలో స్వామివారిని విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఉప్పల్: రామంతాపూర్ చిన్న చెరువులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ చిన్న చెరువులో గుర్తు తెలియని మహిళ (60) మృతదేహం నీటిపై తేలి ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మహిళ మెడలో బంగారు గొలుసు, రెండు చేతులకు బంగారు గాజులు, ముక్కుపుడక, ఉంగరం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



బోనాల జాతరకు విరాళం

అల్వాల్: వెంకటాపురం డివిజన్ సుభాష్‌నగర్‌లోని అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ సీనియర్ నేతలు గడ్డి శివఅభిషేక్ హాజరై పూజలు చేశారు. బోనాల జాతరకు రూ.30 వేలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. నాయకులు రవికిరణ్, ఆంథోని, మహేందర్‌రెడ్డి, దేవాలయ కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: సఫిల్‌గూడ లేక్ పార్కు వద్ద ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. బుధవారం హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. సఫిల్‌గూడ చెరువు హెచ్‌ఎండీఏ పరిధి, లేక్ పార్కు, నిమజ్జన పాండ్ జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉండటం వల్ల సమన్వయ లోపం ఏర్పడుతుందన్నారు. ఇటీవల మేయర్ పర్యటించినప్పుడు కూడా ఈ సమస్యను వివరించామన్నారు. పార్కులో లైట్లు, టైల్స్, మొక్కల పెంపకం, పిల్లల ఆటవస్తువులు, జిమ్‌వద్ద ఇసుక, టాయిలెట్స్ తదితర మరమ్మతులపై ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేశారని, త్వరలోనే అనుమతి పొందిన తర్వాత పనులు ప్రారంభిస్తారన్నారు. డీఈలు రామారావు, మహేష్, కౌశిక్ రెడ్డి, దీపక్, వనజ తదితరులు పాల్గొన్నారు.

కేసుల నమోదుకు అనుమతి అవసరం లేదు

ప్రముఖ న్యాయవాది సుంకర నరేష్

కుషాయిగూడ: ప్రభుత్వ భూమిని ప్రైవేటు భూమిగా రిజిస్ట్రేషన్ చేసిన ప్రభుత్వ అధికారులపై కేసులు నమోదు చేయడానికి ఎలాంటి అనుమతులు అవసరం లేదని హైకోర్టు తీర్పునిచ్చిందని ప్రముఖ న్యాయవాది సుంకర నరేష్ అన్నారు. ఈ మేరకు హైకోర్టు కుషాయిగూడ పోలీసులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ కేసు వివరాలను బుధవారం ఆయన వెల్లడించారు. కాప్రా మండల పరిధిలోని సర్వే నెంబరు 199లోని ప్రభుత్వ భూమిని సర్వే నెంబరు 177లో పట్టా భూమిగా చూపిస్తూ.. అక్రమ రిజిస్ట్రేషన్ చేశారన్నారు. ఈ విషయాన్ని సామాజిక కార్యకర్త చప్పిడి కృష్ణారెడ్డి పలుసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని సీసీఎల్ఏ కమిషనర్‌కు కోర్టు ఆదేశాలు అందాయన్నారు. ఈ నివేదిక ఆధారంగానే అధికార దుర్వినియోగానికి పాల్పడిన తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ , సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లపై తగిన చర్యలు తీసుకోవాలని కుషాయిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోర్టు అనుమతి లేకుండా తాము ఎలాంటి చర్యలు తీసుకోలేమని పోలీసులు చెప్పడంతో కృష్ణారెడ్డి న్యాయవాది నరేష్‌ను ఆశ్రయించారు. దీనిపై ఆయన హైకోర్టులో వాదనలు వినిపించగా.. కోర్టు అధికార దుర్వినియోగానికి పాల్పడిన అధికారులపై కేసుల నమోదుకు అనుమతి అవసరం లేదని జస్టిస్ ఎన్. తుకారాంజీ స్పష్టం చేశారన్నారు. ఈ కేసుపై విచారణ చేపట్టి నేర అభియోగపత్రాలను దాఖలు చేయాలని హైకోర్టు పోలీసులను ఆదేశించిందన్నారు. ఈ విషయంపై కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్‌ను వివరణ కోరగా.. తమకు కోర్టు నుంచి ఉత్తర్వులు అందలేదని చెప్పారు.



కార్పొరేటర్ పర్యటన

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ మెట్లగల్లీలోని భూగర్భ డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు బుధవారం కార్పొరేటర్ బండారు శ్రీవాణివెంకట్‌రావు జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ రజనీకాంత్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్థానికంగా ఉన్న హోటళ్లు, బార్లు, రెస్టారెంట్ల వ్యర్థాలను డ్రైనేజీలోకి పంపిస్తున్నారని, దీంతో మ్యాన్‌హోల్‌లో వ్యర్థాలు నిండిపోయి మురుగు రోడ్లపై ప్రవహిస్తుందన్నారు. ఈ విషయాన్ని జీహెచ్‌ఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి ఇష్టానుసారంగా వ్యర్థాలను పారవేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే ఇందిరానగర్‌లో నూతన భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు. స్థానికులు ఆదినారాయణ, వేదవతి పూస సత్తయ్య, రాపోలు రాములు తదితరులున్నారు.



బాక్స్‌డ్రైన్ పనుల పరిశీలన

మల్కాజిగిరి: బీజేఆర్‌నగర్‌లో జరుగుతున్న బాక్స్‌డ్రైన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అధికారులకు సూచించారు. బుధవారం పనులను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ.. డ్రైన్ నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను త్వరితగతిన పక్కకు మార్చాలన్నారు. సుమారు రూ.కోటితో బాక్స్‌డ్రైన్ నిర్మాణం చేపట్టామని, పూర్తయితే ముంపు సమస్య తీరుతుందన్నారు. ఏడీఈ యాదగిరి, ఏఈ శ్రీకాంత్, వీఐ రజనీకాంత్ పాల్గొన్నారు.

స్వచ్ఛ నిబంధనలు పాటించే కాలనీలకు నజరానా



పారిశుద్ధ్య కార్మికులతో డీసీ ఆంజనేయులు, అధికారులు

ఉప్పల్: జీహెచ్‌ఎంసీ ఉప్పల్ సర్కిల్ బస్తీలు, కాలనీలకు ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్ నజరానా ప్రకటించారు. సర్కిల్ పరిధిలోని 4 డివిజన్‌లో పైలెట్ ప్రాజెక్టుగా స్వచ్ఛ సర్కిల్‌గా రూపొందించేందుకు డీసీ ఆంజనేయులు ఆధ్వర్యంలో పలు స్వచ్ఛత కార్యక్రమాలు, అవగాహన సదస్సులతో ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్లపై చెత్త వేయకుండా ఉండేలా అవగాహన కల్పించడం లాంటి కార్యక్రమాలతో పాటు చెత్త పాయింట్ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు అధికారులతో సహకరించడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్వచ్ఛ నిబంధనలు పాటించే కాలనీలు, బస్తీలు, అపార్టుమెంట్ వాసులకు వెల్ఫేర్‌కు ఉపయోగపడేలా రూ.5లక్షల వరకు అందించనున్నట్లు ప్రకటించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు వివరించారు.

మాజీ మంత్రి కేటీఆర్‌కు శుభాకాంక్షల వెల్లువ





అల్వాల్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో బుధవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కాప్రా: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిశారు. పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.